
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 2 డిసెంబరు 2024



పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

● టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండవ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం జగిత్యాల పట్టణంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా భాగస్వాములేనని, వారి భాగస్వామ్యంతోనే ప్రభుత్వం విజయాలు సాధిస్తుందని, అలాంటి విజయ ఫలాలను ఉద్యోగులకు కూడా అందించాలని కోరారు. బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. 317 జీవో వల్ల స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు అందరిని స్థానిక జిల్లాలకు పంపించే విధంగా ప్రభుత్వం చేయడానికి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తుంగారి సురేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, గజభీంకార్ గోవర్ధన్, నాయుడు, సాయికృష్ణ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అంజన్న సన్నిధిలో దీపారాధన

మల్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో కార్తీకమాసం పురస్కరిం చుకొని నెల రోజులుగా నిర్వహిస్తున్న కార్తీకదీపో త్సవం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయంలో కార్తీక దీపారాధన చేశారు. భక్తులతో కలిసి అధికారులు, సిబ్బంది కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపం డితులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో రామకృష్ణ, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, రాజేందర్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు

ఉచిత షుగర్ పరీక్షలకు స్పందన

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన డయాబెటిస్ టెస్టింగ్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. ఆదివారం ఉదయం శ్రీ కోదండ రామాలయం ఆవరణలో 130 మంది వాకర్స్‌కు ఉచిత డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ జగిత్యాల అధ్యక్షుడు తాటిపాముల వినోద్ కుమార్, కార్యదర్శి వడ్డగట్ల శంకర్, కోశాధికారి గుండేటి గంగాధర్, చాప్టర్ ప్రెజెంట్ శ్రీరాముల సుదర్శన్ పాల్గొన్నారు.

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై తర్జన భర్జన

- ఫ్యాక్టరీల నుంచి 'డెల్టా'కు స్వస్తి..?
- అధ్యయన బాధ్యతలు క్యాపిటల్ ఫార్చున్స్ కంపెనీకి అప్పగింత
- మార్చిలోపు అందజేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- తొలుత మెట్‌పల్లి యూనిట్‌కు యోచన



నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ

జగిత్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) పునరుద్ధరణపై తర్జన భర్జన చోటుచేసుకుంటోంది. ఇటీవల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను పునరుద్ధరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరించినప్పటికీ తాము నడ పలేమని భాగస్వామ్య సంస్థ అయిన డెల్టా పేపర్స్ లిమిటెడ్ గతంలోనే ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సంస్థలో 51శాతం వాటాను కలిగియున్న డెల్టాకు స్వస్తి పలకాలంటే ఆస్తుల విలువ, సాంకేతిక స్థితిగతులు, న్యాయపరమైన చిక్కులు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

కన్సల్‌టెంట్‌గా క్యాపిటల్ ఫార్చ్యూన్స్ కంపెనీ..

నిజాం షుగర్స్‌పై అధ్యయనం చేసి ఆస్తుల విలువను లెక్కించి అవసరమైన సలహాలు, సూచనలతో నివేదికను సమర్పించడానికి క్యాపిటల్ ఫార్చ్యున్స్ అను సంస్థను కన్సల్‌టెంట్‌గా ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించింది. వచ్చే మార్చి మాసాంతంలోపు కన్సల్‌టెంట్ కంపెనీ అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించింది. ప్రస్తుతం కంపెనీ ఆస్తుల విలువ లెక్కింపుపై దృష్టి సారించారు. ప్రస్తుతం కర్మాగారాల్లో గల యంత్రం పరికరాలు వినియోగించే స్థితిలో ఉన్నాయా...మరమ్మతులతో నడిపించుకునే వీలు ఉంటుందా..లేదంటే కొత్తవి కొనుగోలు చేయాలా అన్న వివరాలు సేకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్‌డీఎస్‌ఎల్ తరపున సమాచారం ఇచ్చేందుకు సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ డిప్యూటీ డైరెక్టర్‌ను సమన్వయ అధికారిగా ప్రభుత్వం నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. రానున్న మూడు నెలల్లో కన్సల్‌టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా తరువాత చర్యలు తీసుకోవడానికి యోచిస్తున్నారు. డెల్టా వాటాను తిరిగి అప్పగించి స్వస్తి పలకాలంటే ఏం చేయాలన్న అంశంపై ప్రధానంగా దృష్టి సారించారు.

(తరువాయి 8వ పేజీలో)

తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు బదిలీ చేసిన నాయబ్ తహసీల్దార్లను, తహసీల్దార్లను వెంటనే పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని, లేదంటే సీసీఎల్ఏ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం రెవెన్యూ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎలాంటి సంబంధం లేకుండా అధికారులను దూర ప్రాంతాలకు బదిలీ చేశారని, వారిని పూర్వ జిల్లాకు వెంటనే బదిలీ చేయడంతో పాటు రిటైర్‌మెంట్ దగ్గర ఉన్న ఉద్యోగులను వెంటనే బదిలీ చేయాలని, రెవెన్యూ ఉద్యోగులకు డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లను జిల్లా కేంద్రాల్లో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ధరణి ఆపరేటర్లకు, మీ సేవ ఆపరేటర్లకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

● ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని, వ్యాధి నిర్మూళనపై విస్తృత ప్రచారం అవసరమని, అందుకు మీడియా, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రకరకాల కారణాలతో ఎయిడ్స్ సోకుతుంద ఎయిడ్స్ రోగులు సాధారణ రోగులేనని, అది అంటు వ్యాధి కానందున ఎయిడ్స్ రోగులను చులకన చేయరాదని, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో అవ గాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఐఎంఏ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ జైపాల్ రెడ్డి, డాక్టర్ సుధీర్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలి

బుగ్గారం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో గణితంపై పట్టు సాధిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎంఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలంగాణ గణిత ఫోరం బుగ్గారం మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి గణితం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి టాలెంట్ టెస్ట్ దోహద పడతాయనీ అన్నారు. విజేతలుగా నిలిచిన జెడ్పీహెచ్ వెల్గొండకు చెందిన అశ్విత్ కుమార్, జడ్పీహెచ్ఎస్ బుగ్గారం మండలానికి చెందిన శివాని, మధుప్రియ, కీర్తన, నాగలక్ష్మిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, జీవన్‌కుమార్ మండల గణిత ఫోరం అధ్యక్షుడు, గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వార్డుల్లో ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాలను నిర్వహించారు. మురికి కాల్వలను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డిసెంబరు 1 నుంచి 9 తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఇంచార్జు సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆశోక్, మున్సిపల్ జవాన్లు పాల్గొన్నారు.

అబ్బురపడేలా.. వనసంరక్షణ

- ఇరవై ఏళ్ల క్రితమే హరితహారం..
- ఓబులాపూర్ గ్రామస్థుల సమష్టి కృషి.. పెరిగిన అటవీ విస్తీర్ణం

6



ఓబులాపూర్‌లో పెంచిన టేకు చెట్లు

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేనా ?

- అమలుకు నోచుకోని ఐటీడీఏ పథకం
- కలగానే కేంద్ర మంత్రి హామీ

8



జగన్నాథ్‌పూర్ గ్రామం

కొండగట్టు అంజన్న సేవలో హీరో శ్రీకాంత్



శ్రీకాంత్‌కు అంజన్న చిత్రపటం బహుకరిస్తున్న ఈవో రామకృష్ణరావు

మల్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో శ్రీకాంత్ ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. శ్రీకాంత్‌తో పాటు మరో నటుడు చంద్రకాంత్, నిర్మాత విజయ్ ఆలయానికి రాగ ఈవో రామకృష్ణారావు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపాధ్యాయుల చంద్రశేకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఉన్నారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ కార్తీక మాసంలో ఉపవాస దీక్ష చేశానని చివరి రోజు ఆలయాల దర్శనాల్లో భాగంగా ఆంజనేయస్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు. స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. హీరో శ్రీకాంత్‌తో భక్తులు, ఆయన అభిమానులు సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

నరసింహుడి సన్నిధిలో...

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్ ఆదివారం సందర్శించారు. ఆలయం వద్ద మంగళ వాయిద్యాల వెంట రాగా వారికి వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో అర్చకులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. అనంతరం వారికి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

అన్ని మండలాల్లో వ్యాసరచన పోటీలు



జగిత్యాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం జగిత్యాల జిల్లాలో అన్ని మండల విద్యా కేంద్రాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి కొప్పుల రాజేష్, మండల విద్యాధికారులు గాయత్రి, వాసం భీమయ్య, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదవుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్

బీర్‌పూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదవుల సమస్యలు పరిష్కారం చేయడంతో పాటు సంఘాల బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని యా దవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నా రు. ఆదివారం బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో యాదవ సమా వేశాన్ని నిర్వహించి సభ్యత్వ నమోదు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవ సం ఘాన్ని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేసి యాదవ హక్కులను సాధించుకుటామని తెలిపారు. అనంతరం యాదవ నాయ కులతో పలు అంశాలపై చర్చించి సభ్యత్వాలను స్వీకరించారు ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారు కొలుముల రమణ, రెబ్బాస్ మల్లన్న, యాదవ సం ఘం అడ్‌హక్ కమిటీ బీర్‌పూర్ మండల ఇన్‌చార్జిలు పూరెడి కొమురెల్లి, బనుక శంకర్, చల్ల లక్ష్మన్, బండ మల్లేష్, మాదం మల్లేష్‌లతో పాటు యాదవ సం ఘాల నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి నూతన రథం

కొడిమ్యాల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి రథాన్ని శనివారం భక్తులు ఊరేగింపుగా, భజన కార్యక్రమాలతో ఆలయ పరిసరాలకు తీసుకవచ్చారు. గ్రామ చివర ఉంచిన రథానికి ఆయ పూజారి నాగరాజు రమేష్ ప్రత్యేక పూజలు చేయగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా పట్టణ ప్రకృతి వనాలు

● దర్శనమిస్తున్న పిచ్చి మొక్కలు



పట్టణ ప్రకృతి వనంలో పెరిగిన పిచ్చి మొక్కలు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు అం దుబాటులో ఉండి ఆహ్లాదభరితమైన వాతావరణం అందించే పట్టణ ప్రకృతి వనాలు అధ్వానంగా తయారయ్యాయి. పట్టణ ప్రకృతి వనాల్లో పనులు చేపట్టకపోవడంతో అందులో పిచ్చి మొక్కలు పెరిగి స్థానిక ప్రజలకు ఆహ్లాదం కరువైంది. గత ప్రభుత్వ హయాంలో పట్ట ణంలోని అర్బన్ హౌజింగ్ కాలనీ, టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనాలు నిర్వహణకు నోచుకోకపోవడంతో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. క్రమంతప్పకుండ నిర్వహణ చేపట్టాల్సిన మున్సిపల్ యంత్రాంగం వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పట్టణ ప్రకృతి వనాలు ఆదరణ కోల్పోతున్నాయి. దీంతో అవి కాస్త అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మా రుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని ప్రకృతి వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు సైతం దెబ్బతినడంతో ఉదయం వాకర్స్ వా కింగ్ చేయడానికి ఇబ్బందిగా మారింది. పచ్చని చెట్లతో ప్రజలకు ఆహ్లాదాన్ని ఇవ్వాల్సిన పార్క్‌లు చెత్తా చెదరంతో నిండి పోతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణ ప్రకృతి వనాలను వాడుకలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ధర్మపురిలో ఘనంగా అనంత దీపోత్సవం

ముగిసిన కార్తీక మాస హారతి



శివ లింగానికి పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమమార్, అర్చకులు, సిబ్బంది

ధర్మపురి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోదావరి నదీ తీరాన అనంత దీపోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రాగా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, కలిసి గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నదీ తీరాన లక్ష్మీ నరసింహస్వామి ప్రతిమకు, శివ లింగానికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మెట్లపైన ఉంచిన దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోదావరినది దీపాలతో శోభిల్లింది. రాత్రి వేళలో కార్తీక మాసం వీడ్కోలు పలికి గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలకు ప్రభుత్వవిప్ అడ్లూరిలక్ష్మణ్‌కుమార్ వాయనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి-రాజేష్, జక్కు పద్మ-రవీందర్, సంగనభట్ల సంతోషి పాల్గొన్నారు.

రాబోయే పుష్కరాలను వైభవంగా నిర్వహిస్తాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కార్తీక మాసం చివరి రోజున ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నది వద్ద ఆదివారం నిర్వహించిన ముగింపు హారతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గోదావ రి హారతి కార్య క్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. నెల రోజుల నుంచి వైభవంగా గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిం చామని, ఈ ప్రాంత ప్రజలకు నదీమాత ఆశీస్సులు, లక్ష్మీ నరసిం హస్వామి ఆశీస్సులు ఎళ్లవేళలో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా
హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూవిస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్‌ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్లు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో
రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్టు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్టు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.

కాయ్ రాజా కాయ్..

జూదం ఆడేందుకు శ్రీలంక, నేపాల్‌కు జిల్లావాసులు

- కమీషన్ తీసుకుని పంపిస్తున్న ఏజెంట్లు



కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడేందుకు జిల్లావాసులు పెద్ద ఎత్తున పేకాటరాయుళ్ల శ్రీలంక, నేపాల్, వియత్నాం, కంబోడియా వంటి దేశాలకు వెళుతున్నారు. రాష్ట్రంలో పేకాట క్లబ్‌లు మూసివేయడంతో జిల్లాలో జూదం చాలామట్టుకు తగ్గిపోయింది. దీంతో పేకాటరాయుళ్ల దొంగచాటుగా కొన్ని ప్రాంతాల్లో స్థావరాలుగా ఏర్పాటు చేసుకుని రమ్మీ, తీన్‌పత్తా, ఇతర రకాల పందెం ఆడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులకు చిక్కుతుండడంతో సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకుని జూదం ఆడుతున్నారు. కొంతకాలం క్రితం వరకు జిల్లా నుంచి చాలా మంది గోవాకు వెళి అక్కడ క్యాసినో ఆడేవారు. మహారాష్ట్ర సరిహద్దులో అక్రమంగా ఏర్పాటు చేసిన ఒక స్థావరంలో బహిరంగంగానే పేకాట ఆడేవారు. ఇటీవల ఆ స్థావరాన్ని మూసివేయడంతో ఇతర దేశాలకు వెళ్లి జూదం అడుతున్నారు.

ప్రత్యేక ఆఫర్లు

శ్రీలంక, నేపాల్, వియత్నాం, కంబోడియా వంటి దేశాల్లో క్యాసినోకు అక్కడి ప్రభుత్వ అనుమతి ఉండడంతో జిల్లాకు చెందిన చాలా మంది వ్యాపారులు, రియల్టర్లు, ఉద్యోగులు, విదేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపు తున్నారు. దీనిని క్యాష్ చేసుకు నేందుకు అక్కడి క్యాసినో నిర్వాహకులు జిల్లాలోని కొందరిని ఏజెంట్లుగా నియమించుకున్నారు. ఆఫర్లను ప్రకటిస్తున్నారు. కరీంనగర్ నుంచి ఇతర దేశాలైన శ్రీలంక, నేపాల్‌లోని ఖాట్మాండుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏజెంట్లకు ఒక్కొక్కరిపై 10 శాతం కమీషన్‌ను అక్కడి సంస్థలు చెల్లిస్తున్నాయి. ఈ ఆఫర్‌లో వెళ్లాలంటే ప్రతి కస్టమర్ రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు డిపాజిట్‌గా పెట్టాల్సి ఉంటుంది. ఆ డబ్బులకు సరిపడా కాయిన్స్ అంది స్తారు. జూదం పూర్తి అయిన తరువాత డబ్బులు గెలుచుకుంటే కాయిన్స్‌కు సమానంగా నిర్వాహకులు డబ్బులు చెల్లిస్తారు.

డబ్బులు పోగొట్టుకుని.. అప్పులపాలై..

విదేశాలకు వెళ్లి జూదం ఆడుతున్న వారు 90 శాతం మంది డబ్బులు పోగొట్టుకుని ఇంటికి వస్తున్నారు. జూదంలో ఒక వైపు డబ్బులు పోతున్నప్పటికీ సంపాదించుకోవచ్చనే ఆశతో మళ్లీ మళ్లీ ఆడుతూ లక్షల్లో పోగొట్టుకుంటున్నారు. జిల్లా నుంచి శ్రీలంక, ఖాట్మాండు, ఇతర దేశాలకు వీకెండ్‌లో 40 నుంచి 50 మంది క్యాసినో ఆడేందుకు వెళుతున్నట్లు సమాచారం. వీరందరితో ఏజెంట్లు కొన్ని వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి సమాచారాన్ని పంచుకుంటున్నారు. కొందరు యువకులు స్నేహితులతో టూర్‌కు వెళుతున్నట్లుగా కుటుంబ సభ్యులకు చెబుతూ క్యాసినో ఆడేందుకు వెళుతున్నారు. యువకులు ఈ వ్యసనం భారినపడి అప్పులపాలవుతున్నారు. పోలీసులు ఇటువంటి వ్యవహారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఓబులాపూర్ శివారులో టేకు వనం



టేకు వనంలోని చెట్లు

అబ్బురపడేలా..
వన సంరక్షణ

- ఇరవై ఏళ్ల క్రితమే హరితహారం..
- ఓబులాపూర్ గ్రామస్థుల సమష్టి కృషి..
- పెరిగిన అటవీ విస్తీర్ణం

మల్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామస్థుల సమష్టి కృషితో అటవీ విస్తీర్ణం పెరిగింది. గ్రామస్థులు ఐక్యతతో ఇరవై ఏళ్ల క్రితమే హరితహారినికి ఇక్కడ నాంది పలికారు. రాష్ట్ర ప్రభుత్వం గత కొనేళ్లుగా హరితహారం పేరిట కార్యక్రమాలు చేపట్టగా, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు గతంలోనే వనసంరక్షణ, వనాల పెంపునకు ఈ గ్రామస్థులు తీసుకున్న కృషికి సార్క్‌దేశాలే అబ్బుర పడ్డాయి. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడును కూడా ఆకర్షించగా, ఆయన ఇక్కడి గ్రామస్థులను అభినందించారు. వివరాలలోకి వెళితే.. మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామం అటవీ ప్రాంతంలో పచ్చని గుట్టల మధ్య ఉంది. ఈ గ్రామ పరిధిలో ఇక్కడ దాదాపు 4,619 ఎకరాల పరిధిలో అటవీ విస్తీర్ణం ఉంది. అప్పటి ప్రభుత్వం వనసంరక్షణ సమితిలను ఏర్పాటు చేయగా ఇక్కడ కూడా గ్రామస్థులు రాజకీయాలకు తావీయకుండా సమష్టిగా వనం పెంపునకు కృషి చుశారు. ముఖ్యంగా టేకు వనాన్ని పెంచడంతో నేడు ఈ ప్రాంతంలో అటవీ విస్తీర్ణం పెరిగింది. దాదాపు 5వేల ఎకరాల్లో టేకు వనం పరచుకుంది. అటవీశాఖతో పాటు గ్రామస్థుల పర్యవేక్షణ నేటికీ కొనసాగుతోంది.

సార్క్‌దేశాల గుర్తింపు.. చంద్రబాబు ప్రశంసలు

ఓబులాపూర్ గ్రామస్థుల సమష్టి కృషితో అటవీ విస్తీర్ణం పెరగడంతో అప్పట్లో సార్క్ దేశాలను ఆకట్టుకుంది. 20 ఏళ్ల క్రితం గోవాలో జరిగిన సార్క్ సదస్సులో 8 దేశాల ప్రతినిధులు పాల్గొనగా అప్పటి వీఎస్‌ఎస్ చైర్మన్ వెంకటి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమష్టి కృషిని వివరించారు. దీంతో సార్క్ దేశాల ప్రతినిధులు వారి విజయగాథను తెలుసుకొని వీరి కృషిని అభినందించారు. ఓగులాపూర్ గ్రామస్థుల కృషిని, వనసంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామస్థుల కృషిని అభినందిస్తూ ప్రశంసాపత్రం పంపించారు. అటవీ అభివృధికి నిధులు మంజూరు చేస్తు ఓగులాపూర్ వాసుల ఆదర్శాన్ని కొనియాడారు.

అందరి బాధ్యతగా వన సంరక్షణ

గ్రామ పరిధిలో 5వేల ఎకరాలకు విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాన్ని గ్రామస్థులు దాని సంరక్షణతో పాటు వాటర్ షెడ్, రాక్‌ఫిల్ డ్యాంలు నిర్మించి ఆదర్శంగా నిలిచారు. నాటి వన సంరక్షణకు ఇటీవల బీటలు వారుతున్నాయని, ఈ ప్రాంతంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే వనసంరక్షణ ఫలాలు ముందు తరాలకు చేరుతాయని గ్రామస్థులు అంటున్నారు.టేకు వనం కంటికి రెప్పగా కాపాడుకుంటున్నామని, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన దీన్ని మరింత గుర్తించి పోత్సాహించాలని కోరుతున్నారు.

పట్టభద్రుల గొంతుక వినిపిస్తా..

- నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి - అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'విద్యాసంస్థల యజమానిగా నేను ఎంతో మందిని విద్యావంతులుగా తయారు చేశా.. చదువుకున్న వారి సమస్యల పరిష్కారానికే రాజకీయాల్లోకి వచ్చా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశీర్వదిస్తే చట్టసభల్లో పట్టభద్రుల గొంతుక వినిపిస్తా'.. అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాను మూడు నెలలుగా కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించాన న్నారు. ఈ సందర్భంగా విద్యావంతులు, నిరుద్యోగులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులను కలిసి వారితో చర్చించి సమస్యలు తెలుసుకున్నానన్నారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని సంపూర్ణమైన మద్దతు తెలుపడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈరోజు పట్టభద్రులంటే ఎవరికీ పట్టనివారుగా, భద్రతలేని వ్యక్తులుగా తయారయ్యారన్నారు. వీఎన్‌ఆర్ టీమ్ ద్వారా రెండు లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించామని, దీనికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. విద్యాసంస్థల యజమానిగా ఉన్న అనుభవంతో రాబోయే రోజుల్లో నిరుద్యోగ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారందరికి హెల్త్ కార్డు సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. ఈనెల 2వ తేదీ నుంచి కరీంనగర్‌లో టెట్ కోచింగ్ ఉచితంగా ఇప్పిస్తానని తెలిపారు.

భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న వీఎన్‌ఆర్ అభిమానులు, విద్యార్థులు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ఆదివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వావిలాలపల్లి అల్ఫోర్స్ జెన్‌నెక్ట్ మైదానం నుంచి 1500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎ నరేశ్, కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, సుక్మా స్టేట్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, తానిపర్తి తిరుపతిరావు, చిదుర సురేశ్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, అపూర్వ విద్యాసంస్థల అధినేత వేణు, వి సతీష్‌కుమార్, కనకం వంశీ, కేశిపెద్ది శ్రీధర్‌రాజు, రాజిరెడ్డి, కిషన్‌నాయక్, పెండ్యాల కేశవరెడ్డి, ఎర్రంశెట్టి మునీందర్, ప్రభాకర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, మజీద్, అజీజ్, సర్దార్ శార్దూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో ఎస్‌యూ వీసీ పూజలు

ధర్మపురి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన ఇద్దరి అరెస్ట్

జ్యోతినగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ మెయిన్ రోడ్డులోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో నవంబరు 26వ తరేదీ రాత్రి చోరీకి యత్నించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26న ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేసిన విషయంలో బ్యాంకు మేనేజర్ రణధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ కేసులో నిందితులు తుమ్మల మధు(నందిగామ, కృష్ణా జిల్లా ఏపీ), బండ్ల అబ్రహం(నందిగామ)లను ఆదివారం అరెస్టు చేసి వారు చోరీకి ఉపయోగించిన వస్తువులు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు. నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసిన ఎస్ఐ ఉదయ్‌కిరణ్ పీసీలు టి అంజయ్య, జె శ్రీనివాస్‌ను రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ అభినందించారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

బీర్‌పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం ఓ లారీ బ్రేకులు ఫెయిలై పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. కోదాడ నుంచి జగిత్యాల మీదుగా రెండు లారీలు జన్నారం వెళ్తున్నాయి. ఒకదాని వెనుక ఒకటి వస్తున్న క్రమంలో బీర్‌పూర్ ఘాట్ రోడ్డు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయి ముందున్న లారీని ఢీకొని అదుపు తప్పి పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి లారీ యాజమానులకు సమాచారాన్ని అందించారు. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల శ్రీనివాస్(35) అనే యువకుడు 12 రోజుల క్రితం దుబాయ్‌లో ఆత్మహ త్య చేసుకొని మృతి చెందగా మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబసభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. చివరిచూపుల అనంతరం గ్రామశివారులో అంత్యక్రియలు నిర్వహించారు. దండ్ల శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధుమిత్రులు కోరారు.

కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు

- నేటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు
- అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో అప్రమత్తమైన పోలీసులు

మంథని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు సోమవారం నాటితో 25 ఏళ్లు నిండాయి. ఉమ్మడి రాష్ట్రంలోని మంథని నియోజకవర్గం మల్హర్ మండలం కొయ్యూరు అటవీ ప్రాంతంలో 1999 డిసెంబరు 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పటి పీపుల్స్‌వార్ గ్రూపునకు చెందిన ముగ్గురు అగ్రనేతలు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు అసువులుబాశారు. వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా మావోయిస్టు పార్టీ 2000 డిసెంబరు 2న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)ను ఏర్పాటు చేసింది. ఏటా డిసెంబరు 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు కొనసాగుతున్నాయి.

● సామాన్య కార్యకర్తలుగా చేరి..

పీపుల్స్‌వార్ ఉద్యమాన్ని దేశ విప్లవోద్యమ చరిత్రలో అగ్రభాగాన నిలిపిన సాయుధ కమ్యూనిస్టు పోరాట సిద్ధాంత నిర్మాతలు నల్లా ఆదిరెడ్డి అలియాస్ శ్యాం, శీలం నరేష్ అలియాస్ మురళి, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి అలియాస్ మహేష్‌లు విప్లవోద్యమంలోనే అసువులు బాసారు. మంథని నియోజకవర్గంలోని మల్హర్ మం డలం కొయ్యూరు(ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌటంర్‌లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేష్, వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు సామాన్య కార్యకర్తలుగా పీపుల్స్‌వార్‌లో చేరి క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. రెండున్నర దశాబ్దాల పాటు విప్లవోద్యమంలో పనిచేసిన వారు కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. వారి స్మృతిలో, స్ఫూర్తితో ఆవిర్భవించిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)కి సోమవారం నాటితో 24ఏళ్లు నిండాయి. ఈ నేపథ్యంలో పీఎల్‌జీఏ వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు మావోయిస్టు అగ్రనేతలు పిలుపునివ్వగా, అడ్డుకునేందుకు పోలీసు బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. కాగా, పీఎల్‌జీఏ వారోత్సవాల ప్రారంభానికి ముందు రోజే ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక వద్ద ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో జిల్లాకు చెందిన మావోయిస్టు నాయకుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు(43) మృతిచెందాడు. దీంతో మంథని నియోజకవర్గంలోని అటవీగ్రామాల్లో అలజడి నెలకొంది.


అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)


సంఘటన స్థలంలో సంతోష్‌రెడ్డి మృతదేహం(ఫైల్)


నల్లా ఆదిరెడ్డి (ఫైల్)


ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (ఫైల్)


శీలం నరేష్ (ఫైల్)

గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్నారనే ఖచ్చితమైన సమాచారంతో సిరిసిల్ల టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సుధాకర్, స్థానిక ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం దాడి చేశారు. కరీంనగర్ పట్టణానికి చెందిన వ్యక్తి సయ్యద్ అబ్దుల్ బాసిత్ వద్ద నుంచి 80 గ్రాముల ఎండు గంజాయితో పాటు ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామని స్థానిక ఎస్‌ఐ రమాకాంత్ పేర్కొన్నారు. సయ్యద్ అబ్దుల్ బాసిత్ గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంతంలోని యువకులకు విక్రయిస్తున్నాడని తెలిపారు. గంజాయి విలువ నాలుగువేల రూపాయలు ఉంటుందని చెప్పారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని తమకు అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ రమాకాంత్ సూచించారు.

నాలుగు ట్రాక్టర్లు పట్టివేత

మానకొండూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ మేరకు నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోద చేశామని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

- బాలికల విభాగంలో కరీంనగర్.. బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు విజయం

హుజూరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలు ఆదివారం ముగి శాయి. మొదట క్రీడాకారులను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ పుల్ల శోభన్‌కుమార్ పరిచయం చేసుకొని ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థు లు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అడిషనల్ ఎస్పీ శోభన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థు లు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. తాను ఆటలతోనే ఈ స్థాయికి ఎదిగానన్నా రు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదీ ఇష్టమో దానిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, వర్ధినేని రవీందర్‌రావు, బండ శ్రీనివాస్, గుడిపాటి జైపాల్‌రెడ్డి, సారయ్య, రాజిరెడ్డి, ఉమాయ్య, శ్రీనివాస్, రమేష్, రవికుమార్, శ్యామ్‌కు మార్, తిరుపతి, యూసఫ్, సజ్జు, రాకేష్, రాజు పాల్గొన్నారు.


బాలికల విభాగంలో గెలుపొందిన కరీంనగర్ జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

● విజేతలు వీరే..

హుజూరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో బాలుర విభాగంలో నిజామాబాద్‌పై ఆదిలాబాద్ రెండు గోల్స్ చేసి విజయం సాధించింది. బాలికల విభాగంలో నిజామాబాద్‌పై కరీంనగర్ జట్టు రెండు గోల్స్ సాధించి విజేతగా నిలిచారు. విజేతలకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బహుమతులను అందజేశారు.

● జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

హుజూరాబాద్‌లో నిర్వహించిన హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేశారు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన నిమ్మటూరి మిధున, మాటూరి అవిజ్ఞా, షైటి ఏజెంల్, సహస్ర, చింతల పరిణీత ఎంపికయ్యారు. ఈ నెల 9న మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి హాకీ పోటీ ల్లో వీరు పాల్గొంటారని హుజూరాబాద్ హాకీ క్లబ్ గౌర వ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షు డు బండ శ్రీనివాస్ తెలిపారు.

రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రావు

చిగురుమామిడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక అభివృద్ధికి పాడి పరిశ్రమ ద్వారా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టరు వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని నవాబుపేట, సుందరగిరి గ్రామాల్లో ఆదివారం జాతీయ సేవా పథకంలో భాగంగా పీవీ నరసింహారావు తెలంగాణా వెటర్నరీ యూనివర్సిటీ కోరుట్ల కళాశాల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 82 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేశామని చెప్పారు. పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండోచైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, పాల కేంద్రం చైర్మన్ ఠాకూర్ నరేందర్ సింగ్, వైద్యులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగు నీరు

- ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

పెద్దపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ అయకట్టుకు సాగునీరు అందే ప్రాజెక్టులను చేపడతామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఆయన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదట ధాన్యం కొనుగోళ్లపై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తికరంగా ఉందన్నారు. 4వ తేదీన సీఎం పర్యటన ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. సీఎం పర్యటన సమయానికి వంద శాతం ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించాలని ఆదేశించారు. రోళ్ల వాగు ప్రాజెక్టుకు అటవీ భూముల సేకరణను నీటి పారుదల శాఖ భూసేకరణ, ఆర్‌అండ్ ఆర్ కోసం ప్రత్యేకంగా కేటాయించిన అధికారితో సమన్వయం చేస్తూ పూర్తి చేయాలన్నారు. యాసంగి పంటకు నీటి విడుదలపై సమగ్ర ప్రణాళిక తయారు చేసి రైతులకు స్పష్టమైన సమాచారం కలెక్టర్ల ద్వారా అందిస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూ సేకరణకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేస్తామన్నారు. కాల్వ పనులు త్వరగా చేపట్టేలా స్థానిక రైతులతో మాట్లాడి కోర్టు కేసు విత్‌డ్రా చేయించాలని మంత్రి ప్రజాప్రతినిధులను కోరారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఐదు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని అన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరు వరకు పూర్తి చేసి వచ్చే సీజన్ నుంచి రైతులకు సాగు నీరు అందించాలని మంత్రి సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని ప్యాకేజ్-9 పెండింగ్ పనులు, చిన్న కాళేశ్వరం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెద్దపల్లిలో 4న లక్ష మందితో జరిగే యువ వికాసం సభను విజయవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

● చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది..

గత పాలకుల వల్ల చిన్న కాళేశ్వరం ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలని అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. పోతారం ఎత్తిపోతలకు పథకం, భీంఘనపూర్ ఎత్తిపోతల పథకం పనుల ప్రతిపాదనలు అందజేయాలని అన్నారు.

● గౌరవెల్లి, గండిపల్లి పనులను పూర్తి చేయాలి

గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టులను లింక్ చేసి సమాంతరంగా నిర్మాణపనులు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి బండ్ నిర్మాణం చివరి దశలో ఉందని, కాలువల పనులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా జరుగుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్లు పాల్గొన్నారు.

ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో పెద్దపల్లి జిల్లా వాసి మృతి

- మృతుడు డివిజన్ కమిటీ కార్యదర్శి ఏగోలపు మలయ్య

కోల్‌సిటీ/పాలకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక వద్ద ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్దపల్లి జిల్లాకు చెందిన ఏగోళపు మల్లయ్య అలియాస్ మధు(46) మృతిచెందాడు. మల్లయ్య ఏటూరునాగారం-మ హదేవపూర్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతడిపై తెలంగాణ పోలీసులు ఎనిమిది లక్షల రూపాయల రివార్డును గతంలో ప్రకటించారు. మృతుడిది పాలకుర్తి మండలం రాణాపూర్ స్వగ్రామం. ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. 1995లో మల్లయ్య అజ్ఞాతంలోకి వెళ్లాడు. 18ఏళ్ల వయసులోపే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్టు గ్రామస్థులు పేర్కొంటున్నారు. మొదట దళ సభ్యుడిగా పని చేసిన ఆయన అనంతరం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దండకారణ్యంలో పనిచేశాడు. ఉత్తర తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాల విస్తరణలో భాగంగా బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి, ఏగోళపు మల్లయ్యలకు బాధ్యతలు అప్పగించారు. ఏగోళపు మల్లయ్య అటవీ ప్రాంతమైన మహదేవపూర్, ఏటూరునాగారం డివిజన్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. సుమారు 30 ఏళ్లు పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల్లో పనిచేసిన ఆయనకు ఈ ప్రాంతంపై పట్టు ఉండడంతో ఆయనకు బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కుటుంబసభ్యులు ఏటూరు నాగారానికి వెళ్లారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మల్లయ్య మృతదే హం ఫొటోలను రాణాపూర్ గ్రామస్థులు సరిగా గుర్తించలేకపోయారు. మల్లయ్య 30ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లడంతో స్థానికులకు పోల్చులేక పోయారు. ఎట్టకేలకు కుటుంబసభ్యులు గుర్తించినట్టు పోలీసులు పేర్కొంటున్నారు.

● రాణాపూర్‌లో విషాదఛాయలు..

ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాలకుర్తి మండలంలోని రాణాపూర్‌కు చెందిన ఏగోలపు మల్లయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ఏగోలపు గట్టయ్య-వెంకటమ్మ దంపతులకు రాజయ్య, లచ్చయ్య, శ్రీనివాస్, మల్లేష్ నలుగురు కుమారులతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుల్లో చిన్నవాడైన మల్లేష్ 1995లో గ్రామంలో జరుగుతున్న భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ అప్పటి సీపీఐ(ఎంఎల్) పీపుల్స్ వార్ పార్టీ జిల్లా కార్యదర్శి బోడకుంటి సత్తయ్య అలియాస్ భూమన్న నాయకత్వంలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. అంచెలంచెలుగా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. మల్లయ్య మరణంపై కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


ఏగోళపు మల్లయ్య అలియాస్ మధు మృతదేహం

మావోయిస్టుల్లో పెద్దపల్లి జిల్లా నుంచి 11మంది

- కేంద్ర కమిటీలో ముగ్గురు

- ఏడాదిలో ఎన్‌కౌంటర్లలో ఇద్దరు మృతి

- కీలక బాధ్యతల్లో కంకణాల రాజిరెడ్డి

కోల్‌సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీలో పెద్దపల్లి జిల్లా నుంచి 11మంది ఉన్నారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు కాగా, ఇద్దరు రాష్ట్ర కమిటీ, మిగతావారు జిల్లా కమిటీల్లో పని చేస్తున్నారు. పెద్దపల్లికి చెందిన మల్లవరుపుల వేణుగోపాల్ అలియాస్ ప్రహ్లాద్, మంథని మండలం శాస్త్రులపల్లికి చెందిన మల్లా రాజిరెడ్డి, జూలపల్లి మండలం వడ్కాపూర్‌కు చెందిన పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న కేంద్ర కమిటీ సభ్యులుగా పని చేస్తున్నారు. సబ్బితం గ్రామానికి చెందిన గంకిడి సత్యనారాయణరెడ్డి అలియాస్ విజయ్, కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేష్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరితో పాటు రామగుండానికి చెందిన అప్పాసి నారాయణ, పాలితం గ్రామానికి చెందిన ఆలేటి రామలచ్చులు, కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్‌రావు, జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లికి చెందిన దీకొండ శంకరయ్య, గోపయ్యపల్లికి చెందిన దాతు ఐలయ్యలు డివిజన్ కమిటీ, ఏరియా కమిటీల్లో పని చేస్తున్నారు. రాణాపూర్‌కు చెందిన ఏగోళపు మల్లయ్య ఛత్తీస్‌గడ్‌లో డివిజన్ కమిటీ సభ్యుడిగా పని చేయగా అతనికి ఏటూరునాగారం-మహదేవాపూర్ కమిటీ బాధ్యతలు అప్పగించారు. అతడు ఆదివారం ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ఆరునెలల క్రితం పాలకుర్తి మండలం జయ్యారంనకు చెందిన చీమల నర్సయ్య ఛత్తీస్‌గడ్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ఏడాదిలో జిల్లాకు చెందిన ఇద్దరు అజ్ఞాత మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లలో మృతి చెందారు. ఇంకా జిల్లా నుంచి 11మంది మాత్రమే పార్టీలో కొనసాగుతున్నారు. మల్లవరుపుల వేణుగోపాల్, పుల్లూరి ప్రసాద్‌రావు, మల్లా రాజిరెడ్డి కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. కిష్టంపేటకు చెందిన కంకణాల రాజిరెడ్డి ఉత్తర తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాల్లో కీలకంగా ఉన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో పార్టీ కార్యకలాపాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఉన్న నాయకులంతా 25 ఏళ్ల క్రితం ముందే అజ్ఞాతంలోకి వెళ్లారు.

సమాచారం

Ambedkar Overseas Vidya Nidhi

పేదలకు వరం.. విదేశీ విద్యా నిధి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశాల్లో చదివేందుకు అవకాశం
- రూ.20 లక్షల ఆర్థిక సహాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులు విదేశాల్లో చది వేందుకు 2014 సంవత్సరంలో విదేశీ విద్యా నిధి పథకాన్ని ప్రారంభించింది. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీ విద్యార్థులు చదువుకునేందుకు ఆర్థికసాయం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం, మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్యానిధి పథకం, బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకం అమలు చేస్తోంది. ప్రతిభ, అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి 20 లక్షల రూపాయల ఆర్థికసాయం అందిస్తోంది. ఈ పథ కాల ద్వారా జిల్లాలో 2023-24 సంవత్సరానికి అత్యధికంగా ఎస్సీ విద్యార్థులు 8మంది విదేశాల్లో చదువుకునేందుకు ఆర్థిక సాయం పొందారు. బీసీల్లో నలుగురు విద్యార్థులు ప్రభుత్వ సహ కారంతో విదేశాల్లో చదువుతున్నారు. ఒక ఎస్టీ విద్యార్థి విదేశీ విద్యానిధికి అర్హత సాధించారు. మైనార్టీల్లో ఆరుగురు అర్హత సాధించగా వారికి ఇంకా నిధులు మంజురు కాలేదు. 2024-25 సంవత్సరానికి గాను దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

అర్హులు ఎవరంటే...

- ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- జీఆర్‌ఈ, జీ మ్యాట్‌లో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఇంగ్లీష్ ప్రొఫీషియెన్సీ టెస్టులో ప్రతిభ చూపాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలి.
- ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే అవకాశం.



● ఆన్‌లైన్‌లో దరఖాస్తు

దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థి వివరాలను పూరించి సంబంధిత ధ్రువ పత్రాలను జేపీజీ ఫార్మాట్‌లో జతపర్చాలి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం రెండుసార్లు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి ఆధ్వర్యంలోని కమిటీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపడుతుంది. జీఆర్‌ఈ/జీమ్యాట్‌లో ప్రతిభ, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎం పిక చేస్తారు. ఎంపికైన వారికి విదేశీ విశ్వ విద్యాలయానికి సంబంధించిన ప్రవేశలేఖ ఆధారంగా రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తారు. వన్‌వే ఎకనామిక్ టికెట్, వీసా ఛార్జీలను చెల్లిస్తారు. మైనార్టీ, ఎస్టీ విద్యార్థులు

■ కావలసిన ధ్రువపత్రాలు

-ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రేషన్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, స్థానికత ధ్రువ పత్రం, పదో తరగతి మెమో, చివరి కోర్స్ మా ర్కుల మెమో, బదిలీ సర్టిఫికెట్, జీఆర్‌ఈ, జీమ్యాట్ స్కోర్ కార్డులు, పాస్‌పోర్ట్ కాపీ, బ్యాం కు ఖాతా పాస్ బుక్, విదేశీ విశ్వవిద్యాలయ ప్రవేశ లేఖ.

డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది.

● 10 దేశాల్లో చదువుకునే అవకాశం

అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో చదువుకునే అవకాశం కలదు.

వైద్య శిబిరానికి స్పందన

కథలాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కోరుట్ల రెనె ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ ఆసుపత్రి వైద్యుడు బంగారి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. బీపీ, సుగర్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ అజయ్ కృ ష్ణ పలువురి వైద్య పరీక్షలను నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ అరవింద్, అడ్మినిస్టేర్ బత్తిని అనుదీప్, మార్కెటింగ్ మేనేజర్ నూతిపల్లి వెంకటేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సిద్ధం



వేంకటేశ్వర స్వామి ఆలయం

కొడిమ్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంక టేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 4 నుంచి 6వరకు నిర్వహించడానికి ఆలయ నిర్మాణ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుడు నాగరాజు రమేష్ నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 4న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, అన్న ప్రసాద కార్యక్రమం, 5న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, 6న స్వామి వారి రథోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆలయానికి రాజగోపురం, చుట్టు సీసీ రోడ్డు, మండ పానికి ఇరువైపుల రేకుల షెడ్ నిర్మాణం చేయాల్సి ఉంది.

బాలికకు ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ నవ్యశ్రీ అనే బాలికకు జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త సూరజ్ శివ శంకర్ రూ.10 వేలు, మరో వ్యక్తి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేనా ?



జగన్నాథ్‌పూర్ గ్రామం

- అమలుకు నోచుకోని ఐటీడీఏ పథకం- కలగానే కేంద్ర మంత్రి హామీ

రాయికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షగానే మిగిలాయి. రాయికల్ మండలంలో అధిక సంఖ్యలో జీవిస్తున్న గిరిజనులకు ఐటీడీఏ ఏర్పాటు అయితే ప్రభుత్వ పథకాలు అందడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు వారికి అందుతాయి. మినీ ఐటీడీఏ కోసం కేంద్ర మంత్రి ఇచ్చిన హామీ కలగానే మిగిలింది. విద్య, వైద్యం, రోడ్లు, సొంతింటి కల తదితర పథకాలు అందని ద్రాక్షగా మారాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధిక గిరిజనులు జీవిస్తున్న రెండో ప్రాంతం రాయికల్ కావడం గమనార్హం. రికార్డుల్లో గిరిజనులు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టిలో ఉన్నప్పటికీ ఆశించిన నిధులు రాక గిరిజన పల్లెలు ఇంకా వెనుకబడే ఉన్నాయి.

- 32 పంచాయతీలు..

రాయికల్ మండ లం 32 గ్రామ పంచాయతీలు, 20 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒడ్డెలింగాపూర్, చింతలూర్, బోర్నపెల్లి, జగన్నాథ్‌పూర్, వస్తాపూర్, ధర్మాజీపేట, తాట్లవాయి, కట్కాపూర్, దావన్‌పెల్లి, రాజనగరం, ఇటిక్యా ల గ్రామాల్లో గిరిజనులు జీవిస్తున్నారు. జగన్నాథ్‌పూర్, తాట్లవాయి, దావన్‌పెల్లి గ్రామాల్లో గిరిజనులదే మెజా ర్టీ. గిరిజనుల అభివృద్ధికి మినీ ఐటీడీఏ ఏర్పాటు చేస్తా మని గతంలో సీఎం కేసీఆర్ రాయికల్ పర్యటన సందర్భంగా కేంద్ర గిరిజన శాఖ మంత్రి జోలోరాం హామీ ఇచ్చినప్పటికీ ఆట్టి హామీ ఇప్పటికీ నెరవేరలేదు. మినీ ఐటీడీఏ ఏర్పాటు జరిగితే గిరిజనులకు అన్ని విధాల పథకాలు దరి చేరి అభివృద్ధి త్వరితగతిన పూర్తవుతుంది. ప్రత్యేక నిధులు అందుతాయని చాలా కాలంగా ఇ క్కడి గిరిజనులు మినీ ఐటీడీఏ కోసం పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో గిరిజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అ క్కడే అన్న చందంగా తయారైంది. చాలా గ్రామాల్లో గి రిజనులు మట్టి రోడ్లపైనే ప్రయాణిస్తున్నారు. విద్య, వైద్యం అంతంతా మాత్రమే. సాగునీటి వసతి లేదు. కాలువలు ఉన్నప్పటికీ కాలువ చివరి గ్రామాలు కావడంతో సాగునీరు అందని పరిస్థితి. చాలా గ్రామాల్లో వ్యవసాయం బోరు బావులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. బోర్నపెల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలు ఉన్నా లేనట్లే. పలు గ్రామాల్లో అం తర్గత రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రభుత్వం మినీ ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



మినీ ఐటీడీఏ ఏర్పాటును మరిచిన ప్రభుత్వం

రాయికల్ మండలంలో మినీ ఐటీడీఏ ఏర్పాటు చే యాలని తాము చాలా ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. గిరిజనులకు అందించే ప్రభుత్వ పథకాలు వందశాతం గిరిజనుల దరి చేరడం లేదు. నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదు. రహదారుల అభివృద్ధి అంతంతా మా త్రంగానే ఉంది. ప్రభుత్వం మినీ ఐటీడీఏను ఏర్పాటు చేయాలి.

- ఆత్రం రవీందర్, గిరిజన సంఘం నేత



ఐటీడీఏ ఏర్పడితే గిరిజనుల అభివృద్ధి

ఎన్నో ఏళ్లుగా రాయికల్‌లో మినీ ఐటీడీఏ ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మండల పరిధిలో గిరిజనులు ఎక్కువగా జీవిస్తున్నారు. మినీ ఐటీడీఏ ఏ ర్పడితే గిరిజనుల అభివృద్ధి జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మినీ ఐటీడీఏ ఏర్పాటు చేస్తే మంచిది.

వేణు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి నేత

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా

జగిత్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంతో నమ్మకంతో తనను ఎన్నికల్లో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి ఎంతైనా శ్రమిస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణం లోని 7వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు ము న్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేస్తానని, ఐదు సంవత్సరాల్లో ప్రతి వార్డుకు దాదాపు రూ.2 కోట్ల వరకు నిధులు మంజూరు చే యించి అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధికి కొలమానం లేదని, అది నిరంతర ప్ర క్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, ము న్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు రేణుక, ప్రేమలత, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, నాయకులు మొగిలి, సత్యం పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై తర్జన భర్జన

(5వ పేజీ తరువాయి)

నిజామాబాద్ జిల్లా బోధన్ కేంద్రంగా 1938లో నిజాం సర్కారు నిజాం చక్కర కర్మాగారం ప్రారంభించింది. దీనికి అనుబంధంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో పరిశ్రమలను స్థాపించింది. గత పాలకుల విధానాలు, పరిశ్రమ నష్టాల బాట పట్టిందన్న కారణంతో 2002లో ప్రైవేటీకరణ చేశారు.

ఈ మూడు యూనిట్లు 51 ప్రైవేటు డెల్టా కంపెనీ, 49 శాతం ప్రభుత్వ వాటాలను కలిగి ఉన్నాయి. అయినప్పటికీ నష్టాల నుంచి బయట పడక పోవడంతో 2015 డిసెంబర్ 23వ తేదీన లేఆఫ్‌గా ప్రకటించి బోధన్, ముత్యంపేట, ముంబోజుపల్లి కర్మాగారాలను యాజమాన్యం మూ సివేసింది. తరువాత బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో కర్మాగారాలను తెరిపి స్తామని హామీ నిచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాల పునరుద్ధరణకు హామీనిచ్చింది.

● మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా కమిటీ..

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైస్ చైర్మన్‌గా సభ్యులుగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, పలు విభాగాలకు చెందిన రాష్ట్ర స్థాయి అధికారులను నియమించింది. కమిటీ ఇప్పటికే కర్మాగారాలను సందర్శించి ప్రభుత్వానికి సమాచారం అందించింది. కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం నాలుగు నెలల క్రితం ఆమోదించింది. ఈ నేపథ్యంలో పలు కారణాల వల్ల లేఆఫ్‌తో మూసివేసిన కర్మాగారాలు బ్యాంకుల్లో అప్పుల్లో ఉండగా వీటికి సంబంధించి, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ. 190 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. దీంతో ఎన్‌డీఎస్ఎల్‌కు రుణ విముక్తి లభించినట్లయింది.

● నిర్వహణపై స్పష్టత కరువు

ఎన్‌డీఎస్ఎల్‌లో భాగస్వామిగా ఉన్న డెల్టా కంపెనీకి స్వస్తి పలికి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలన్న యోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తరువాత కర్మాగారాలను ఏ తరహాలో నిర్వహించాలన్న అంశంపై కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ పెద్దలు పలు విధాలుగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ ఉండాలా.. ప్రైవేటు కంపెనీకి బాధ్యతలు అప్పగించాలా...సహకార పద్ధతిలో నిర్వహించాలా అన్న అంశంపై ఇంకా స్పష్టత రావడం లేదు. సహకార పద్ధతిలో నడిచే షుగర్ ఫ్యాక్టరీల ప్రోత్సాహకానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు చేయడంతో నిధులు రావాలంటే సహకార విధానం అనుసరించాలా అన్న చర్చలు సైతం చోటుచేసుకుంటున్నాయి.

వచ్చే యేడాది డిసెంబర్ నాటికి కర్మాగారాలను పునరుద్ధరణ జరుగుతుందని కమిటీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కర్మాగార పునరుద్ధరణపై అన్నదాతలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ డెలిగెట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌ను ఆదివారం మెట్‌పల్లి పట్టణ గంజువాడ, చైతన్య నగర్ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరు నవీన్‌ను పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంజు ఏరియా సంఘం అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్, చైతన్య నగర్ ఏరియా సంఘం అధ్యక్షులు పుల్లూరు నవీన్, నాయకులు హరీష్, నవీన్, పవన్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

● మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై నూతన సిబ్బందికి డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో ఏదైన రోడ్డు ప్రమాదం జరిగితే తమ కుటుంబ సభ్యుల పరిస్థితి ఏమిటనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. వాహనదారులు ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను నూతనంగా విధుల్లో చేరిన సిబ్బందికి తెలిపారు. ఏఎస్సై సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



వెల్లుల్ల శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

ఘనంగా అయ్యప్ప స్వామి పల్లకీ సేవ

మల్లాపూర్, డిసెంబరు, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పునరావాస గ్రామమైనకు కుస్తాపూర్‌లో ఆదివారం అయ్యప్ప దీ క్షాపరులు పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాలతో అభి షేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు, హారతీ తదితర కార్యక్రమాలను దీక్షపరులు చేపట్టారు. అనంతరం భక్తి శ్రద్ధలతో స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండుగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి హారతులతో స్వాగతం పలుకుతూ స్వామియే శరణమయ్యప్ప నామస్మ రణతో మారు మోగింది. స్వామి వారి పల్లకీ సేవలో షైపాల్‌తో పాటు పలువురు దీక్షపరులు, భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దీక్షాపరులు


ఆరోగ్యానికి నడక దివ్య ఔషధం



ప్ల-కార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బుగ్గారం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మనిషి ఆరోగ్యానికి నడక దివ్య ఔషధమని గ్లోబల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్.నక్క రాజు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో గ్లోబల్ హై స్కూల్ విద్యార్థులు మనిషి ఆరోగ్య మనుగడకు దివ్య ఔషధం నడక అని చాటిచెబుతూ ఆదివారం రెండు కిలోమీటర్ల వాకింగ్ లక్ష్యాన్ని చేరుకొని మానవహారం నిర్వహించారు. ఆరోగ్యమే-మహాభాగ్యం మొదలగు నినాదాలతో కూడిన ప్ల-కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలకు చిన్న వయస్సులోనే ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉండాలని, అందులో భాగంగానే తాము రెండు కిలోమీటర్ల వాకింగ్ కార్యక్రమం చేపట్టి విద్యార్థులతో పాటు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎస్సై ప్రకాష్, ప్రవీణ్, గడ్డం రమేష్, ఆంజనేయస్వామి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గొల్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్స్ కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాల్లో క్రీడాపోటీలను నెహ్రూ యువకేంద్రం, ఫ్రెంచ్ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పోటీలకు పీఈటీలుగా అంకం శేఖర్, రవితేజ వ్యవహరించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షులు కట్ట మహేష్, చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పోలవేణి భూమేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. కబడ్డీలో మండలంలోని రాపల్లె జట్టు ప్రథమ విజేతగా, దట్నూర్ ద్వితీయ విజేతగా నిలిచారు. వాలీబాల్‌లో గొల్లపల్లి జట్టు ప్రథమ, మల్లన్నపేట జట్టు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. పరుగుపందెంలో మనోహర్, మన్మోహన్, సాయి విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు మండల జగన్, రాజసింహారావు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు

విద్యార్థులు విభిన్న ఆలోచనా విధానం అలవర్చుకోవాలి

వెల్గటూర్ ఎంఈవో ప్రభాకర్

వెల్గటూర్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విభిన్న ఆలోచనా విధానం అలవరుచుకోవాలని ఎంఈవో ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం వెల్గటూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలో ప్రథమ స్థానంలో భాను ప్రసాద్, ద్వితీయ స్థానంలో అరుణ్‌కుమార్, తృతీయ స్థానంలో లక్ష్మి మన్విత నిలువగా వారికి బహుమతులు అందజేశారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం రాయికల్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పునరుద్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఆంగ్ల మాధ్యమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బి.వైష్ణవి ప్రథమ బహుమతి, కే జీబీవీకి చెందిన జె.సాహిత్య ద్వితీయ బహుమతి పొం దారు. తెలుగు మాధ్యమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురకు చెందిన కె.నిరంజన్ ప్రథమ, డి. అశ్విత ద్వితీయ బహు మతి పొందారు. ఉర్దూ మాధ్యమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూకు చెందిన అల్ఫనాజ్, అజ్మీరలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు, ప్రధానోపాధ్యాయుడు నసీర్ అహ్మద్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల ఎంఆర్‌సీలో ఆదివారం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పురుత్పాదక వనరులు అనే అంశంపై మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో డి.హర్షిక ప్రథమ, పి.లహరి ద్వితీయ, ఎం.అంజనీతనయ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఎంఈవో జయసింహరావు బహు మతులు అందించారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో

ఇబ్రహీంపట్నం: ఎంఈవో మధు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన గోధుర్ జడ్పీ పాఠశాలకు చెందిన రూప్లాషా, కోజన్‌కొత్తూర్ ఎంపీహెచ్ఎస్‌కు చెందిన సంతోషి, ఇబ్రహీంపట్నం జడ్పీ పాఠశాల విద్యార్థి హరీషికలకు మండల స్థాయి బహుమతులను అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్న సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్ : ప్రజాపాలన, ప్రజావిజయోచవాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో దామోదర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : విద్యార్థులు చదువుతో పాటు వక్తృత్వ పోటీల్లో రాణించాలని ఎంఈవో జమునాదేవి పేర్కొన్నారు. ఆదివారం గొల్లపల్లి ఎమ్మార్సీ భవనంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మొత్తం 58 మంది పోటీల్లో పాల్గొన్నారు. గొల్లపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన జాషిఖ్ బేగమ్ ప్రథమ విజేతగా, ద్వితీయ విజేతగా చెందోళి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన అర్చన, రాపల్లె జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన టీనా తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఎంఈవో చేతుల మీదుగా బహుమ తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాముల పల్లె జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ : మండలంలోని జిల్లా ప్రజాపరిష్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో నాగ భూషణం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీలలో 37 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్ర మంలో లక్ష్మినర్సయ్య, భీమరాజం, ప్రకాష్, మధుసు ధన్, విగ్నేష్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక పాఠశాల విద్యార్థులకు మం డల స్థాయి వ్యాస రచన పోటీలను ఆదివారం నిర్వహించారు. పలు పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. పట్టణంలోని బాలికల పాఠశాల విద్యార్థిని హిమని మొదటి స్థానం, రెండవ స్థానంలో వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి మ ణిదీప్, మూడవ స్థానంలో సిద్దార్థ హైస్కూల్ విద్యార్థి హర్షిత్ నిలిచినట్లు ఎంఈవో నరేశం తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, కిషమోహన్‌రావు, నరసింహమూర్తి, హరివరప్రసాద్, కేరళ ఇంగ్లీష్ మీడియా పాఠశాల కరస్పాండెంట్ బారీ, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



గురుస్వామికి ధర్మదండన అందిస్తున్న అయ్యప్ప స్వాములు

కోరుట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప దేవాలయం ఆదివారం శరణుఘో షతో మారుమోగింది. దేవాలయ ప్రధాన అర్చకుడు, వేదపండితుడు పాలెపు రాంశర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ఉపాధ్యక్షుడు నాగరాజు 18వ సారి దీక్ష తీసుకోగా ఆలయ ఆవరణలో అష్టదశ కళశ, మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి, సుబ్రమణ్య, అయ్యప్ప స్వాముల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకం, పూజలను నిర్వహించారు. పదునెట్టాంబడికి కర్పూర హారతులను అందించి వేడుకలను నిర్వహించారు. ఆలయంలో డిసెంబరు 1 నుంచి జనవరి 15వ తేది వరకు జరిగే అన్నదానం కార్యక్రమాన్ని అయ్యప్ప స్వాములు ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి రూ. 1,11, 116 విజయ్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు నిమిషకవి నాగరాజు ఆలయ అభివృద్ధి కమి టీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌కు అందించారు. అలయ కమిటీ సంస్కృతిక కార్యదర్శి గెల్లె శ్రీనివాస్ రూ. 51,116, కాంట్రాక్టర్ ఎన్నమనేని మురళీధర్‌రావు రూ. 25,100, కొమ్మతోట భాస్కర్ రావు మేస్త్రీ రూ 11,111, పండిత్ లక్ష్మి నారాయణ, రూ. 5,116లు విరాళంగా అందించారు. దాతలను పూలమాలలు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తోట రాజు, జుంబర్తి రమేష్, తులసి కృష్ణ, గట్ట ఆనంద్, శ్రీరాముల శ్రీనివాస్, కాసు కాంత్ర, ఆరే లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోరుట్ల : హైదరాబాదులో జరుగుతున్న మాలల సింహా గర్జనకు ఆదివారం పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాల సంఘ సభ్యులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంఘ నాయకులు ప్రత్యేక వాహనాల ద్వార హైదరాబాదుకు బయలు దేరి వెళ్లారు. వాహన శ్రేణిని మాల సంఘ రాష్ట్ర నాయకులు రాజారెడ్డి సంఘ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఉయ్యాల నర్సయ్య, ఉయ్యాల శోభన్, మురళి, రాజేందర్, రాస మల్ల రాజనర్సయ్య, నారాయణ, నరేష్, సంజీవ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

కొడిమ్యాల : హైదరాబాదులో ఆదివారం మాలల సంఘం నేతలు నిర్వహిస్తున్న సింహగర్జన సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి మాలలు తరలివెళ్లారు.

కథలాపూర్ : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంబేద్కర్ మాల సంఘ నాయకులు హైదరాబాదులో ఆదివారం నిర్వహించు మాల సింహగర్జన తరలి వెళ్లారు. ఆ కార్యక్రమంలో సంఘ సభ్యులు దయ్య ప్రశాంత్, తలారి మోహన్, నరేష్, నాగరా జు, లక్ష్మినర్సయ్య, శ్రీదర్, గణేష్, పాల్నొన్నారు.

మెట్‌పల్లిటౌన్: సికింద్రబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహిస్తున్న మాలల సింహ గర్జన సభకు పట్టణంలోని ఇంద్రనగర్‌తో పాటు డివిజన్‌లోని మాల సంఘం నాయకులు ఆదివారం భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పట్టణం నుండి ప్రత్యేక వాహనాలలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం పెద్దలు, కుల సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామ విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీపాద నిఖిల్ చారి ఎన్నికయ్యాడు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యక్షుడిగా తొగిటి సంతోష్, క్యాషియర్‌గా తుమ్మనపెల్లి విజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం మెడికవర్ ఆసుపత్రి కరీంనగర్, వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ వైద్య శిబిరంలో పాల్గొని పేషేంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

దాదాపుగా 120 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో వంటి టెస్ట్‌లను నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.